క్లుప్తంగా

సెకండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సిద్ధం



వేపాడ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలను అన్‌లోడ్ చేయిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను మంగళవారం సరఫరా చేసిందని ఎంఈఓ-2 బాల భాస్కరరావు తెలిపారు. ఈపుస్తకాలను స్థానిక ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు. 8,374 పుస్తకాలు వచ్చాయని వీటిని పాఠశాలలకు అందజేయనున్నామని చెప్పారు.

ఘనంగా నెల్సన్ మండేలా జయంతి



నెల్సన్‌మండేలా జీవిత విశేషాలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్‌మండేలా జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు మాట్లాడుతూ నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, 26 ఏళ్ల కారాగార శిక్ష అనుభవించారన్నారు. ఆయన గాంధీజీ ప్రభోదించిన శాంతియుత మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ రవీంద్రనాథ్, వలీఖాన్, ఆర్.శ్రీలక్ష్మి, పి.భాస్కర్, సీహెచ్.శ్రీనివాసరావు, బి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బడి నాడు-నేడు పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంఈఓ-2 బాలభాస్కరరావు మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని హెచ్‌ఎం వల్లీకి సూచించారు.

థాంక్యూ సీఎం సార్

శృంగవరపుకోట: ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా హయ్యర్ పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీఎం జగన్ ఫొటోకు ఆర్టీసీ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా పనిచేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. డిపో మేనేజర్ కె.రమేష్, ట్రాఫిక్, గ్యారేజ్, ఆఫీస్, సెక్యూరిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తనాల కిట్ల పంపిణీ నేడు

బొండపల్లి: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విత్తనాల కిట్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు 15 రకాల వ విత్తనాలను ఎస్సీ రైతులకు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తులాహ్వానం

మెరకముడిదాం: మండలంలోని బోడందొరవలస అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులాహ్వానిస్తున్న ట్లు చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ కె.వి.ఎన్.ఆర్.రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈపోస్టును బీసీ-ఇకి కేటాయించినట్టు పేర్కొన్నా రు. 10వతరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్థానిక వివాహితలు రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.పూర్తి వివరాలకు చీపురుపల్లి ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నేడు సోంపురం ఆర్బీకే భవనం ప్రారంభం

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే) భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం



సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామసచివాలయ వ్యవస్థతో మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం అయిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి బలిఘట్టాం గ్రామంలో సుమారు రూ.57 లక్షలతో నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అలాగే మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ గతంలో పంచాయతీ భవనాలు, శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలకు కొత్త భవనాలు కావాలంటే జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వచ్చేదని, అయినా ప్రయోజనం దక్కేది కాదని గుర్తు చేశారు. నేడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. సీఎం జగన్ గ్రామాల్లో ప్రతీ రెండు వేల జనాభాకు ఒక సచివాలయం, రైతుభరోసా, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేసి వాటి కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి భవనాలను, ఇతర సదుపాయాలను కల్పించారని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే అందుతున్నాయని, ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధిని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. వెలమ కార్పొ రేషన్ చైర్మన్ నాయుడుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో శరవేగంగా సాగుతున్న అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించడం లేదా అంటూ ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దా లు కావస్తున్నా గ్రామాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధిని గడిచిన నాలుగేళ్లలో సీఎం జగన్ చేసి చూపించారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా, ఎంపీడీఓ వై.పద్మజ, పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జి మెరపుల సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, మేజర్ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ లు మచ్చ ఎర్రారామస్వామి, పి.మంగవేణి, కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, నాయకులు ఆదిరెడ్డి నాయుడు, పెదిరెడ్ల సూరిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటిముంగిటకు అధికార యంత్రాంగం



కొత్తవలస: బలిఘట్టాం గ్రామంలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి, నెక్కలి నాయుడుబాబు



శృంగవరపుకోట: మామిడిపల్లిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా గ్రామాల్లో ప్రజల వద్దకు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులే వచ్చి ప్రభుత్వసేవలు, పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు.11 రకాల ధ్రువపత్రాల మంజూరుతో పాటు అర్హత ఉండి ఎవరికైనా సాంకేతిక సమస్యల వల్ల పథకాలు అందకుంటే సమస్యలు పరిష్కరించి పథకాలు వర్తించేలా చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో మంగళవారం కొనసాగింది. శృంగవరపుకోట,జామి,బొండపల్లి,గంట్యాడ,గజపతినగరం,చీపురుపల్లి, దత్తిరాజేరు, గుర్ల, గరివిడి, మెరకముడిదాం,కొత్తవలస, ఎల్.కోట మండలాల్లోని పలుగ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపుల్లో ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.ఎస్.కోట మండలం ధర్మవరం, కొత్తవలస మండలం బలిఘట్టం గ్రామంలో నిర్వహించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ఎస్.కోట మండలం మామిడిపల్లి, జామి మండలం జాగరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట: భీమాళి గ్రామంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



జామి: జామిలో వృద్ధుడికి ధ్రువపత్రం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి, తదితరులు



దత్తిరాజేరు: టి.భూర్జవలసలో ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, అధికారులు



చీపురుపల్లి: జి.అగ్రహారంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ శిరీష, తదితరులు



గజపతినగరం రూరల్: మరుపల్లిలో యువతికి ధ్రువపత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ దమయంతి



బొండపల్లి: బి.రాజేరులో ధ్రుపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, అధికారులు



గంట్యాడ: రేగుబిల్లిలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ పీరుబండి హైమావతి



చీపురుపల్లిరూరల్: పర్ల గ్రామంలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, తదితరులు



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం ఏనుగువలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



మెరకముడిదాం: మెరకముడిదాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు రమణరాజు, విశ్వేశ్వరరావు



జామి: జాగరంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

విభిన్న ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక అవసరాల చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు భరద్వాజ్

వేపాడ: విభిన్న ప్రతిభావంత చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ-2 బాల భాస్కరరావు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్టు భరద్వాజ్ అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పర్యవేక్షించారు.కేంద్రానికి ప్రత్యేక అవసరాల పిల్లలు ఎంత మంది వస్తున్నారని ఎంఎల్‌టీ రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, పౌష్టికాహారం అందించడంతో పాటు ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు ఇంటివద్ద ఫిజియోథెరపీ చేయాలని చెప్పారు.

కొండ చిలువ హతం



హతమైన కొండ చిలువను చూపిస్తున్న స్థానికుడు

మెరకముడిదాం: మండలంలోని భైరీపురం గ్రామంలో ఏడు అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. గ్రామంలో అయ్యప్పస్వామి పీఠం సమీపంలో మంగళవారం ఓ కొండ చిలువ సంచారాన్ని అటుగా వెళుతున్న తాడ్డి సింహాచలం అనే వ్యక్తి గమనించాడు. వెంటనే దాన్ని హతమార్చాడు.

ఎడతెరిపి లేని వర్షం

బొండపల్లి/ గజపతినగరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో బొండపల్లి, గజపతినగరం మండలాల వ్యాప్తంగా మంగళవారం వేకువ జాము నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. చెరువులు మళ్లీ వర్షం నీటితో నిండుతున్నాయి. రైతులు వారం రోజుల క్రితమే వరి నారులు పోశారు. ఈ వర్షాలు వరినారుమడులకు ఎంతో మేలు చేస్తాయని రైతులు అంటున్నారు.



గజపతినగరం స్టేట్ బ్యాంకు వద్ద నిలిచిన వర్షపు నీరు

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు పెద్దపీట



మాట్లాడుతున్న కస్తూరి, మహిళా ప్రజాప్రతినిధులు

కొత్తవలస: పదవుల్లో, సంక్షేమ పథకాల్లో అన్నింటా మహిళలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మూకల కస్తూరి అన్నారు. మండంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు ఆఫీస్‌లో మహిళాప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకురాలు వంగలపూడి అనిత స్థాయి మరచి ముఖ్య మంత్రి, ఆయన కుటుంబ సభ్యుల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళా సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ, నామినేట్ పదవుల్లో సగం మహిళలకే సీఎం జగన్ కేటాయించారన్నారు. మహిళలను తన సొంత అక్కచెల్లెళ్లుగా భావించి వారు ఆర్థికాభివృద్ధి సాధించాల నే లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం చేసి ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగనన్నదేనని అన్నారు.అనిత నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని, లేకుంటే తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దేగల సాయిలక్ష్మి మాట్లాడుతూ వంగలపూడి అనిత వ్యవహార శైలి మహిళాలోకాన్ని అవమానపరిచే తీరుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తీరుపై సోషల్ మీడియాలో జరిగే ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం తగదన్నారు. కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, ఎల్.కోట వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, కొత్తవలస మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ పొనగంటి మంగవేణి, కొత్తవలస సెగ్మెంట్ -4 ఎంపీటీసీ పి.అనూష, ఆదిరెడ్డి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సరిచూసుకోండి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎన్నికల డీటీ సతీష్‌కుమార్

గజపతినగరం: ఓటర్ల జాబితాలో తప్పులు, డబుల్ ఎంట్రీలు ఉంటే బీఎల్‌ఓల దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు గజపతినగరం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ సూచించారు. త్వరలో నిర్వహించనున్న ఓటర్ల జాబితా ఇంటింట సర్వేపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారని, వారికి సహకరించాలని కోరారు. 18ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కుకు నమోదు చేయించాలని చెప్పారు. మరణించిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం



అవగాహన కల్పిస్తున్న జిల్లా మానసిక వైద్యురాలు మౌనిక తేజశ్వి, తదితరులు

దత్తిరాజేరు: పరీక్షలు అంటే చాలా మంది విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని, పరీక్షలైనా, క్రీడలైనా, ఏ రంగంలో అయినా ఒత్తిడిని అధిగమిస్తేనే విజయాలు సాధించగలమని జిల్లా మానసిక వైద్యురాలు మౌనిక తేజశ్వి అన్నారు. మండలంలోని కె.కొత్తవలస వద్ద ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి అధిగమించడం, మానసిక రుగ్మతలపై మంగళవారం అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో భయంతో ఒత్తిడికి లోనవడం, నిద్ర లేకుండా చదవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఒత్తిడితో చదివితే పాఠ్యాంశాలు గుర్తుండవని చెప్పారు. ఓ ప్రణాళిక ప్రకారం చదవాలని, తగిన నిద్ర, పౌష్టికాహారం తప్పనిసరని, ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దుర్గారావుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న విశ్రాంత ఉద్యోగి దుర్గారావు

శృంగవరపుకోట: పోలీస్‌శాఖలో హెచ్‌సీగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఎస్.కోటకు చెందిన జక్కం దుర్గారావుకు అపూర్వ గౌరవం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన సర్వేజన సుఖినో భవంతు సోషల్, కల్చరల్ ఆర్గనైజేషన్ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఆ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేసింది. ఈనెల 16వ తేదీన హైదరాబాద్‌లో సుందరయ్య కళానిలయంలో దుర్గారావును జస్టిస్ బి.చంద్రకుమార్, ఈ.సూర్యతేజ్ సుభ్రంత్, ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఈ.ఎస్.సూర్యనారాయణ సన్మానించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐకు చంద్రశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న సచివాలయ మహిళా పోలీసులు

కొత్తవలస: గ్రామాల్లో సచివాలయ మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కొత్తవలస సీఐగా బాధ్యతలు స్వీకరించిన వి.చంద్రశేఖర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఐకు మహిళా పోలీసులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకు చేపట్టాల్సిన చర్యలు, చిన్నపిల్లలపై దాడులు,ఈవిటీజింగ్ ,లైంగిక దాడుల నివారణకై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎస్‌ఐలు బొడ్డు దేవి, సీహెచ్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సహకారం



రైతులకు జీవామృతం కవర్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ యాంకర్ సన్యాసమ్మ

వేపాడ: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ సన్యాసమ్మ తెలిపారు. మండలంలోని చినగుడిపాలలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు విత్తనాలతో పాటు జీవామృతాలు, కషాయాల తయారీకి కావాల్సిన సామగ్రి అంతా సమకూర్చుతామని చెప్పారు. పంటలను ఆశించే చీడపురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు, జిగురుపూసిన పసుపుప్లేట్లు, గట్లపై పెంచేందుకు కూరగాయల విత్తనాలు అందిస్తున్నామని వివరించారు. అనంతరం రైతులకు రెండు జీవామృతం కవర్లు అందజేశారు. ఐసీఆర్పీజీ వెంకటరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విజయనగరం: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యన్నారాయణమూర్తి,బలభద్రుని చెన్నయ్యశెట్టి తెలిపారు. సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమా వేశంలో ప్రతిభా పుర స్కారాలప్రధానోత్సవ కర పత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే నెల 15వతేదీ సాయంత్రం ఉల్లివీధి వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్త మాట్లాడు తూ పదవ తరగతిలో 85 శాతం సాధించిన విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ,పాలిటెక్నిక్ విద్యార్థులూ పురస్కారాలకే దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సంఘం భవనంలో దరఖాస్తులు లభిస్తాయని ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.